
గంజాయ్..





● మత్తుకు బానిస అవుతున్న యువత
● సోషల్ మీడియా వేదికగా కొనుగోళ్లు

కడప క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి గుప్పుమంటోంది. ఒకప్పుడు సాధువులు, భిక్షువులు మాత్రమే గంజాయి తాగేవారు. లేదంటే ముసలోళ్లు గంజాయి పీల్చేవారు. ఇప్పుడు యువత కూడా దీని బారిన పడ్డారు. ఇదే అదనుగా భావించి కొందరు సోషల్ మీడియా వేదికగా గంజాయిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల ఎక్సైజ్ పోలీసులు కడపలో దాడులు చేసి 11మంది గంజాయి విక్రయించేవారిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారంతా యువకులు కావడం గమనార్హం. విశాఖ, ఒడిషా రాష్ట్రాల నుంచి గంజాయిని తెచ్చి ఇక్కడ 50 గ్రాములు, వంద గ్రాములు ప్యాకెటుగా చేసి విక్రయిస్తున్నారు. గతంలో మట్టితో తయారు చేసిన చిలుంలో గంజాయి వేసుకుని తాగుతుండేవారు. ప్రస్తుతం యువత సిగరెట్లలో ఎక్కించుకుని తాగుతూ మత్తులో జోగుతున్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



గంజాయి విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అరెస్టు చేస్తాం. పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా గంజాయి నిర్మూలనకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడెక్కడ నుంచి గంజాయి సరఫరా అవుతుందన్న దానిపై నిఘా ఉంచాం. గంజాయి విక్రయించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం.

- రవికుమార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఇన్‌స్టాగ్రాం వేదికగా..

విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. గంజాయి అలవాటు ఉన్నవారితో ఇన్‌స్టాగ్రాంలో గ్రూపు ఏర్పాటు చేస్తున్నారు. గంజాయి కావాల్సిన వారు ఇన్‌స్టాగ్రాం ద్వారా ఫోను చేసి అడిగితే వారు ఒక రహస్య ప్రాంతంలో కలిసి రూ.2వేల నుంచి రూ.5వేల మధ్యలో ఆ ప్యాకెట్లను అమ్ముతున్నారు. మరికొందరు గంజాయిని సిగరెట్లలో నింపి ఒక్కో సిగరెట్ వంద నుంచి రూ.150 మధ్య విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.



గంజాయి రవాణా చేస్తున్నవారిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

జిల్లా అంతటా..

ఒకప్పుడు గంజాయి అమ్మే ప్రాంతాలను పోలీసులు గుర్తుపట్టేవారు. అయితే టెక్నాలజీ పెరగడంతో ఈజీ మనీకోసం అలవాటుపడ్డవారు గంజాయిని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. కడపలో వైఎస్సార్ కాలనీ, రామక్రిష్ణనగర్, మాసాపేటలోని కొత్తకొట్టాలు, తిలక్‌నగర్, గౌస్‌నగర్, అల్మాస్‌పేట, రవీంద్రనగర్ తదితర ప్రాంతాలతో పాటు మైదుకూరు, ప్రొద్దుటూరు, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు, పోరుమామిళ్ల తదితర ప్రాంతాల్లో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయని అంటున్నారు.

ప్రత్యేక టీంలతో నిఘా..

గంజాయి నిర్మూలన కోసం అటు పోలీసులు ఇటు ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి నిఘా ఉంచారు. అక్కడక్కడా గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ వారు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి అరికట్టేందుకు 'ఈగల్' ఏర్పాటు చేసింది. గంజాయి విక్రయాలు సాగించేవారిపై నిఘా పెట్టేందుకు ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఈగల్ టీం డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచారు. గంజాయి విక్రయించే వారిని పోలీసులు అరెస్టు చేస్తున్నా ఈ దందా ఆగడం లేదు. జిల్లాలో ఎక్కడోచోట తరచూ గంజాయి విక్రేతలు పట్టుబడుతూనే ఉన్నారు.

● ఈనెల 18న కడప ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో సీకేదిన్నె మండల పరిధిలో రెండు వేర్వేరు కేసుల్లో గంజాయి విక్రయిస్తున్న 11 మందిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి 4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు పరారయ్యారు.

● జూన్‌లో కడప డీటీసీ వద్ద రిమ్స్ పోలీసులు దంపతులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 కిలోల గంజాయితో పాటు వాహనాన్ని సీజ్ చేశారు.

● మైదుకూరులో గంజాయి విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసి 25 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

● మే నెలలో ఎక్సైజ్ పోలీసులు కడపలో ఐదు గురిని అరెస్టు చేసి 2కిలోల గంజాయి పట్టుకున్నారు.

● ఫిబ్రవరిలో ప్రొద్దుటూరు పరిధిలో 2 గంజాయి కేసులు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేసి 11కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

● ఎక్సైజ్ పోలీసులు ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కడప, ఎర్రగుంట్ల, మైదుకూరు, ప్రొద్దుటూరు, బద్వేలు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ల పరిధిలో 14 కేసులు నమోదు చేసి 49 మందిని అరెస్టు చేసి 14 వాహనాలతో పాటు 22 కిలోల 99 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

కడప కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నుంచి జరిగే ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం డీఆర్వో చాంబరులో డిపార్ట్‌మెంటల్ పరీక్షల నిర్వహణపై పరీక్షల జిల్లా ప్రత్యేక పర్యవేక్షకులు వి.బాబురావు, అసిస్టెంట్ సెక్రటరీ టీటీ బ్రమేశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు కడపలో మూడు చోట్ల పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలన్నారు. లైజాన్ ఆఫీసర్లు, పోలీసులు, చీఫ్ సూపరింటెండెంట్లు సమన్వయంతో పనిచేసి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు.

ఆస్తుల మ్యుటేషన్ సులభతరం

కడప కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే మ్యుటేషన్ ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల శాఖ జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ల అనంతరం మ్యుటేషన్ చేసుకునేందుకు ప్రజలు నానా ఇబ్బంధులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం మ్యుటేషన్ కోసం నూతన విధానాన్ని ప్రవేశ పెట్టిందని తెలిపారు. ఈ విధానాన్ని ఎన్టీఆర్, విజయవాడతో పాటు నాలుగు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టి విజయవంతం చేశారని తెలిపారు. ఇదే విధానం రాష్ట్రంలోని 17 కార్పొరేషన్ల పరిధిలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభం కానుందని వివరించారు. స్థిరాస్తిదారులకు రిజిస్ట్రేషన్ల సమయంలో గతంలో ఉన్న ఇబ్బందులు లేకుండా ఆటో మ్యుటేషన్ జరగనుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ కోరారు.

బాలిక హత్య కేసును అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం

● డీఐజీ కోయ ప్రవీణ్

కడప క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గండికోటలో హత్యకు గురైన బాలిక కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్ తెలిపారు. శనివారం కడపలోని జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా కష్టతరమైన విచారణ చేస్తున్నామన్నారు. సెల్‌టవర్ డంప్ ఆధారంగా దర్యాప్తు సాగుతోందన్నారు. ఘటన జరిగిన రోజు గండికోటకు వచ్చిన సందర్శకుల వద్దకు వెళ్లి అక్కడికక్కడే విచారిస్తున్నామని తెలిపారు. ఆ రోజు అక్కడికి 69 మంది వచ్చినట్లు తెలుస్తోందన్నారు. కుటుంబ సభ్యుల ప్రమేయంపై సోషల్ మీడియాలో అనేక ఆరోపణలు వస్తున్నాయని, ఈ దిశగా కూడా విచారిస్తున్నాం అన్నారు. రంగనాథస్వామి ఆలయం ప్రాంగణంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తు కాస్త ఆలస్యంగా జరుగుతోందన్నారు. బాలిక హత్య జరిగిన రోజున కొండపైన జాతర జరుగుతుండడంతో రెండు టవర్లు నెట్‌వర్క్ చూపిస్తున్నాయని అన్నారు. ఆ రెండు టవర్ల పరిధిలో సెల్లు ఉపయోగించిన 350 మందిని గుర్తించామని, అలాగే సెల్‌ఫోను లేని వారిని కూడా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సాక్షి లేకపోవడంతో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను గుర్తిస్తున్నామన్నారు. త్వరలో కేసును ఛేదిస్తామన్నారు.

ఫుట్‌పాత్‌లపైనే రామభక్తుల పడక 6

కండిషన్ లేని బస్సులు.. ప్రయాణికుల పాట్లు 7

ప్రాజెక్టులున్నా.. నీరు సున్నా... 6

పురమిత్రతో సమస్యల పరిష్కారం

● కాల్ సెంటర్ నెంబర్ 9949093772
● కడప కమిషనర్ మనోజ్‌రెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పురమిత్ర యాప్ ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. శనివారం కడప కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో కమిషనర్ విలేకరులతో మాట్లాడుతూ.. నగర ప్రజలు ప్లేస్టోర్‌లో పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అందులో కార్పొరేషన్‌కు సంబంధించిన వివిధ విభాగాలు ఉంటాయని సమస్యలపై ఆయా విభాగాల్లో ఫిర్యాదు చేస్తే తక్షణం పరిష్కరిస్తామని అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం జరుగుతున్న గ్రీవెన్స్‌కు ప్రజలు వచ్చి ఫిర్యాదులు చేయాల్సిన అవసరం లేదని పురమిత్ర యాప్ ద్వారా వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. అలాగే కాల్ సెంటర్ 9949093772 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన 48గంటల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. బిల్డింగ్ నిర్మాణాలు, లేఅవుట్ల నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రతి శుక్రవారం ఉదయం 10.30గంటలకు కార్పొరేషన్‌లో నిర్వహించే ఓపెన్ ఫోరంలో ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే ఏవైనా సలహాలు కావాల్సిన ఓపెన్ ఫోరంలో తెలుసుకోవచ్చని సూచించారు. కడప కార్పొరేషన్ పరిధిలో అట్టడుగు వర్గాలకు చెందిన 10 వేల కుటుంబాలను గుర్తించామన్నారు. వారికి సహాయం చేసేందుకు ఎన్‌ఆర్‌ఐలు, పారిశ్రామికవేత్తలు, మంచిస్థాయిలో ఉన్నవారు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వ స్కీములు పేదవారికి యథావిధిగా కొనసాగుతాయని ప్రభుత్వం నూతనంగా తలపెట్టిన పీ4కు అందరు సహకరించాలని పిలుపునిచ్చారు. క్లాప్ వాహనాలకు, చెత్త సేకరణకు ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని సూచించారు. ఎవరైన డబ్బులు వసూలు చేస్తున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

భక్తులతో కిటకిటలాడిన గండి క్షేత్రం



ప్రత్యేక అలంకరణలో గండి వీరాంజనేయస్వామి



అంజన్న దర్శనం కోసం క్యూలలో వేచి ఉన్న భక్తులు

చక్రాయపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానం మొదటి శ్రావణ శనివారం భక్తులతో కిటకిటలాడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు పెద్దసంఖ్యలో గండి క్షేత్రానికి తరలివచ్చారు. భక్తుల కోసం దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజ, ఉత్సవ కమిటీ సభ్యులు దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్నానాల కోసం పాపాఘ్నిలో షవర్లు ఏర్పాటు చేసి కాల్వ తీశారు.

మొదటి శ్రావణ శనివారం వివిధ రకాల టికెట్లు, ప్రసాదాల వల్ల గండికి దాదాపు రూ.10లక్షల ఆదాయం వచ్చింది. ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేశ్ స్వామివారి మూలవిరాట్టును తోమాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రావణమాసోత్సవాల సందర్భంగా పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీఐ ఉలసయ్య, ఎస్ఐ రంగారావుతో పాటు 150 మంది పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. డీఎంహెచ్‌ఓ నాగరాజు ఆరోగ్యశిబిరాన్ని సందర్శించి అంజన్నను దర్శించుకున్నారు. డాక్టర్ వాణి ఆధ్వర్యంలో దాదాపు 300 మందికి వైద్యసేవలు అందించారు.

డిజిటల్ అరెస్టు లేదు

● సైబర్ నేరగాళ్ల బారిన పడవద్దు
● అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశంలో.. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్



అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ చిత్రంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు

కడప క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు అనేది లేదని, ప్రజలు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో ఇతర శాఖల అధికారులతో పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ హాలులో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశానికి డీఐజీతో పాటు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, జిల్లా ఫారెస్టు అధికారి వినీత్‌కుమార్, సెవెన్త్ ఏడీజే జీఎస్ రమేశ్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఖదీరున్, ఫోరెన్సిక్ ఐటీ నిపుణులు సురేంద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ డిజిటల్ అరెస్టు అనేది లేదని పలువురు చదువుకున్న విద్యావంతులు, ప్రొఫెషనల్స్ సైతం ఇలాంటి సైబర్ నేరాల బారిన పడుతున్నారని అన్నారు. వీరి మానసిక స్థితిగతులను క్లినికల్ సైకాలజిస్ట్ ద్వారా అధ్యయనం చేసేందుకు తగిన చర్యలు తీసుకుని ఇతరులు బాధితులు కాకుండా చూడవచ్చన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

కలెక్టర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. పోలీసు, జ్యుడిషియల్ శాఖలు నిక్కచ్చిగా వ్యవహరిస్తేనే నేరాలను అరికట్టగలమని అన్నారు. ప్రస్తుతం జనాన్ని భయపెడుతున్న డిజిటల్ అరెస్టు అనే కొత్త నేర పంథా నుంచి ప్రజలను కాపాడేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. సోషల్ మీడియాలో పెట్టే విద్వేషపూరిత పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అశోక్‌కుమార్


ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 42 బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించామని, ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గంజాయి సేవించే ప్రాంతాలను గుర్తించి డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచుతున్నామన్నారు. సైబర్, ఇతర రక్షణకు సంబంధించి తక్షణ సహాయం కోసం 1930, ఎమర్జెన్సీ రెస్పాన్స్ 112, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఎన్‌డీపీఎస్ అండ్ డ్రగ్స్ 1972 హెల్ప్‌లైన్ నెంబర్ల ద్వారా సమాచారం అందించాలన్నారు. శక్తి టీంల ద్వారా కళాశాలలు, పాఠశాలల వద్ద మఫ్టీలో నిఘా ఉంచుతూ ఈవ్‌టీజింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమీక్షలో భాగంగా గడిచిన ఆరు నెలల కాలంలో జిల్లాలో నమోదైన అన్ని రకాల కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈగల్‌టీం ఆధ్వర్యంలో రూపొందించిన గంజాయికి, డ్రగ్స్‌కు గుడ్‌బై చెబుదాం, డ్రగ్స్ వద్దు బ్రో అనే కరపత్రాలను డీఐజీ, ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు కె.ప్రకాశ్‌బాబు, బి.రమణయ్య, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, రైల్వే, న్యాయ, రెవెన్యూ, ఫారెస్టు, రవాణా, ఎక్సైజ్, వైద్య, ఫైర్, జైళ్లశాఖ తదితర అధికారులు పాల్గొన్నారు.

అనంతరం పోలీసు అధికారులకు ఫైరింగ్ ప్రాక్టీసును డీఐజీ కోయప్రవీణ్ నగర శివార్లలోని ఫైరింగ్ రేంజ్‌లో ప్రారంభించారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, డీఎఫ్‌వో వినీత్‌కుమార్ ఫైరింగ్ ప్రాక్టీసు చేశారు. ఎస్ఐ, సీఐ, డీఎస్పీలకు ఫైరింగ్‌లో మెళకువలను డీఐజీ వివరించారు.

సెలవు.. సంబరం







కడప నగరంలోని బిల్టప్ సర్కిల్ నుంచి రామరాజుపల్లె వెళ్లే దారిలో కుడివైపున కేసీకెనాల్ ఉంది. ప్రస్తుతం ఈ కాలువలో నీళ్లు పారుతున్నాయి. శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో కొన్ని స్కూళ్లు సెలవు ప్రకటించాయి. దీంతో విద్యార్థులు కేసీ కెనాల్ నీటిలో ఎగిరి దుముకుతూ కేరింతలు కొట్టారు. కాలువపైన ఏర్పాటు చేసిన సంపు పైపు పైకి ఎక్కి నీళ్లలోకి జారుతూ విన్యాసాలు చేశారు. అయితే పిల్లలు నీళ్ల వద్ద ఉన్నప్పుడు పెద్దలు వారిపై ఓ కన్నేసి ఉంచాలి. లేదంటే వినోదం కాస్త విషాదంగా మారే అవకాశం ఉంది.

- ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

ఫుట్‌పాత్‌లపైనే రామభక్తుల పడక

● రాత్రివేళలో భక్తులకు రక్షణ కరువు

ఒంటిమిట్ట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రెండో అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరాముని భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఒంటిమిట్ట కోదండరాముని ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని నిర్ణయించింది. ఆలయ అభివృద్ధికి 2015లో టీటీడీలో ఆలయాన్ని విలీనం చేసింది. టీటీడీవారు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు కానీ భక్తులకు ఆలయ సమీపంలో సరైన వసతి సౌకర్యాలు కల్పించలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ వారు రూ.100 కోట్లు కేటాయించి అందులో సగం పైగా ఖర్చు పెట్టినా భక్తులకు కనీస వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో ఇక్కడ బస చేసే భక్తులకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీటీడీ వారు ఆలయ సమీపంలో కాకుండా కల్యాణవేదిక వద్ద గదులను నిర్మించారు. అవి ఆలయానికి దూరంగా ఉండడంతో భక్తులు అక్కడికి వెళ్లలేకపోతున్నారు. దీంతో రాత్రివేళలో ఇక్కడే బస చేసే భక్తులు ఫుట్‌పాత్‌లపైన, ఆరుబయట నిద్రించాల్సి వస్తోంది. మరికొంతమంది వారి వాహనాలపైనే నిద్రిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్నవారికి పలు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా దొంగల బెడద ఉంటుందేమోనని భయపడుతున్నారు. ఈ మధ్యనే ఆలయ సమీపంలో ఉన్న వెయిటింగ్ హాలులో భక్తులు విశ్రాంతి తీసుకుంటుండగా రాత్రి వేళల్లో తమ సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వెయిటింగ్ హాలులోనే భద్రత లేనప్పుడు ఆరుబయట ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న భక్తులకు రక్షణ ఎలా ఉంటుందని భక్తులు పేర్కొన్నారు.




వాహనం, ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న భక్తులు

మరోపక్క వర్షం, దోమల బెడద కూడా భక్తులకు తప్పడం లేదు. రాత్రివేళల్లో ఇక్కడ బస చేయకుండా కొంతమంది భక్తులు కోదండరాముని దర్శనం లేకుండానే వెళ్లిపోతున్నారు. మరికొంతమంది ఫుట్‌పాత్‌లపైనే నిద్రిస్తూ వేకువజామునే కోదండరాముని దర్శించుకుని వెళుతున్నారు. దూర ప్రాంతాల నుంచి కోదండరాముని దర్శనానికి విచ్చేస్తున్న భక్తులకు కనీస సౌకర్యాలు లేకపోవడంతో వారికి దర్శనభాగ్యం దక్కక నిరాశగా వెళుతున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి ఆలయ సమీపంలో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసి రాత్రివేళల్లో భక్తులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

కోదండరాముడి దర్శనం కోసం వచ్చే భక్తులకు వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలి.



\- శ్రీనివాసులు, రామభక్తుడు, ఒంటిమిట్ట

రాత్రివేళ భక్తులకు ఇబ్బందులు

కోదండరాముని దర్శనానికి విచ్చేసే భక్తులు రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నారు. బస చేసేందుకు వసతి సౌకర్యాలు లేకపోవడంతో ఆరుబయటనే నిద్రిస్తున్నారు.



\- భాస్కర్‌రెడ్డి, ఒంటిమిట్ట

బాధితులకు న్యాయం... నిందితులకు శిక్ష పడాలి

కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలి : అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరచి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, అలాగే సాక్ష్యాధారాలతో నేర నిరూపణ చేసి నిందితులకు శిక్షపడేలా కృషి చేయాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పోలీసుస్టేషన్‌లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల పురోగతిని ఎప్పకటిప్పుడు పర్యవేక్షిస్తూ ఉన్నతాధికారులకు నివేదించాలని ఆదేశించారు. అన్ని ట్రయల్ కేసుల్లో సత్వర, సక్రమ విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టుల్లో చార్జ్‌షీట్ ఫైల్ చేసిన అనంతరం కోర్టు ద్వారా సంబంధిత కేసుల్లో సీసీ నెంబర్లను తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎప్పటికప్పుడు పెండింగ్ సమన్లు జారీ అయ్యేలా, వారెంట్లు అమలు జరిగేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నూతనంగా అమల్లోకి వచ్చిన బీఎస్ఎస్ఎస్ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కొత్త చట్టం మేరకు కోర్టు ప్రొసీడింగ్స్ జరిగేలా చూడాలని ఆయన ఆదేశించారు. ప్రతి కోర్టు కానిస్టేబుల్ విధిగా తన పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి కోర్టులో హాజరవుతున్న ప్రతి కేసు గురించి అవగాహన పెంచుకుని సరైన సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష పడేలా చూడాలన్నారు. కోర్టు ట్రయల్ సందర్భంలో సంబంధించి స్టేషన్ హౌస్ అధికారి కూడా సమర్థవంతంగా కేసు విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కోర్టుల మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జి.ఆదినారాయణరెడ్డి, ఎస్ఐ రవికుమార్, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

పారిశుధ్య కార్మికులకు దుస్తులు వితరణ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

పీలేరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పీలేరుకు చెందిన వ్యాపారి పామిడి మల్లికార్జున గుప్త తన షష్టి పూర్తికి కుటుంబసభ్యులు, బంధువులనే కాకుండా పీలేరు పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ఆహ్వానించి వారికి దుస్తులు వితరణ చేశారు. అందజేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. పామిడి మల్లికార్జున గుప్త కేవలం వ్యాపారంలోనే కాకుండా లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘం, వాసవీ కపుల్స్, అవోపా వంటి సంఘాల్లో చురుగ్గా ఉంటూ సామాజిక సేవ చేస్తుంటారు. ఆయన శనివారం తన షష్టి పూర్తి చేసుకునే క్రమంలో కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సమాజానికి సేవలందించిన 60 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జేబు కత్తిరించి డబ్బు కొట్టేసే యత్నం



దొంగను పోలీసుకు పట్టిస్తున్న బాధితుడు

● దొంగను పట్టుకున్న బాధితుడు

మదనపల్లె అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జేబు కత్తిరించి డబ్బు కొట్టేయాలనే ప్రయత్నం విఫలమైన సంఘటన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. శనివారం ఉదయం కురబలకోట మండలం ఆర్‌సీ కురవపల్లెకు చెందిన శంకర అనే వ్యక్తి తన తల్లితో కలిసి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వచ్చి ఓపీ తీసుకున్నాడు. డాక్టర్ వద్ద చూపించుకుని మాత్రలు తీసుకునే సమయంలో రద్దీగా ఉండడంతో దొంగ జేబు కత్తిరించి అందులో ఉన్న డబ్బులు రూ.70 వేలు కొట్టేశాడు. గమనించిన బాధితుడు దొంగను పట్టుకున్నాడు. జేబు కట్ చేసినప్పుడు నోట్లు కూడా కట్ అయ్యాయి. తమ్ముడికి చెందిన డబ్బులు బ్యాంకులో చెల్లించడానికి తెచ్చానని, ఆస్పత్రిలో తల్లికి చూపించుకుని బ్యాంకుకు వెళ్లేలోపే ఇలా జరిగిందని వాపోయాడు. ఆస్పత్రి అవుట్ పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని టూటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్ర తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ



ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పడేసిన మద్యం బాటిల్స్

మదనపల్లె అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆస్పత్రి ఆవరణలో మద్యం మత్తులో ఇరువురు అంబులెన్స్ డ్రైవర్లు ఘర్షణ పడిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. కొందరు అంబులెన్స్‌ల డ్రైవర్లు ఆస్పత్రి ఆవరణలోని తమ వాహనాల్లోనే మద్యం తాగుతున్నారు. శుక్రవారం రాత్రి కూడా ఇరువురు మద్యం తాగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వచ్చాయి. రోజూ అంబులెన్స్ డ్రైవర్లు ఇక్కడే ఉంటూ తమ వాహనాలను ఆస్పత్రి చివరిలో ఉంచుకుని అక్కడ మద్యం తాగి ఖాళీ సీసాలను కూడా అక్కడే పడేస్తున్నారు. మద్యం ఎక్కువై ఆస్పత్రికి వస్తున్న వారిపైనో, లేక అంబులెన్స్ మరో డ్రైవర్లపైనా గొడవకు దిగుతున్నారు. మద్యం మత్తులో ఆస్పత్రికి వచ్చే రోగులకు, ప్రజలు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిన ఆస్పత్రికి వచ్చే వారు కోరుతున్నారు.

జిల్లాలో 45 మంది వీఆర్వోల ఆకస్మిక బదిలీలు

కలికిరి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 45 మంది గ్రేడ్-1 వీఆర్వోలను బదిలీ చేస్తూ కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం రాత్రి ఆలస్యంగా ఈ జాబితా విడుదలైంది. బదిలీల జాబితాలో ఉన్న వారిలో ఒకరు కడప జిల్లా, మరొకరు చిత్తూరు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీ కాగా 43 మందిని వివిధ మండలాల నుంచి బదిలీ చేశారు. అత్యధికంగా మదనపల్లె నుంచి 10 మందిని బదిలీ చేశారు. అదే విధంగా రాయచోటి నుంచి 9 మందికి స్థాన చలనం కలిగించారు. పుల్లంపేట నుంచి ముగ్గురు, రాజంపేట నుంచి ముగ్గురు, కురబలకోట నుంచి ముగ్గురు బదిలీ అయ్యారు. వాల్మీకిపురం, కలికిరి, పీలేరు, నిమ్మనపల్లె మండలాల నుంచి ఇద్దరేసి వంతున వీఆర్వోలు బదిలీ అయ్యారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె, చిన్నమండెం, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, గుర్రంకొండ, పీటీఎం మండలాల నుంచి ఒక్కొక్కరు వంతున బదిలీ అయ్యారు. మదనపల్లె నుంచి పలు ఆరోపణల కారణంగా భారీగా వీఆర్వోలకు స్థాన చలనం కలిగించి వివిధ మండలాల నుంచి ఏరికోరి కొంతమందిని అక్కడికి బదిలీ చేసినట్లు సమాచారం. బదిలీ జాబితాలో ఉన్న వారందరినీ ఆయా తహసీల్దార్లు వెంటనే రిలీవ్ చేయాలని, అదేవిధంగా బదిలీ అయిన వారు తక్షణం చార్జి అప్పగించి కొత్త స్థానాల్లో చేరిపోవాలని ఆదేశించారు. సోమవారంలోగా మరో 50 మంది వరకు గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేయనున్నట్లు సమాచారం.

నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశాలు

సుండుపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె పంచాయతీ కార్యాలయంలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆంధ్రజ్యోతి దినపత్రిలో శనివారం వచ్చిన కథనానికి జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ స్పందించారు. నిధుల దుర్వినియోగంపై క్షుణ్ణంగా విచారణ నిర్వహించాలని రాజంపేట డీఎల్పీవో మస్తాన్‌వలిని విచారణ అధికారిగా నియమించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి సమాచారంతో నివేదికను అందించేలా ఆదేశించామన్నారు. ఏడు రోజుల్లో విచారణ చేసి పైఅధికారులకు నివేదికను అందజేస్తానని రాజంపేట డీఎల్పీవో మస్తాన్‌వలి తెలిపారు.

'నవోదయ'లో ప్రవేశానికి

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలంలోని నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే యేడాది చేరే విద్యార్థులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.గంగాధరణ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో 9వ తరగతిలోని ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతిలో చేరవచ్చునన్నారు. దరఖాస్తు ఫారాలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం సెప్టెంబరు 9వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ప్రవేశ పరీక్ష 2026 ఫిబ్రవరి నెల 7వ తేదీ ఉంటుందన్నారు.

11వ తరగతిలో ప్రవేశ పరీక్ష

2026-27లో 11వ తరగతిలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన కడప, అన్నమయ్య జిల్లాల్లోని 25-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు ఫారాలు రిజిస్ట్రేషన్‌కు సెప్టెంబరు 23న ఆఖరి తేదీగా నిర్ణయించామని, ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 7న ఉంటుందని వివరించారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

సుండుపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణం చేస్తున్నారని నోటీసులు ఇచ్చిన ఆపడం లేదని ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు శనివారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజుల నుండి మండలంలోని రాయవరం గ్రామ పంచాయతీ చీనేవాండ్లపల్లెకి ఓ మహిళ అక్రమ నిర్మాణం చేస్తున్నారని ఆపివేయాలని జిల్లా అధికారులు, నియోజకవర్గ పంచాయతీ అధికారులు, మండల అభివృద్ధి, పంచాయతీ అధికారులు నోటీసులు ఇచ్చిన హెచ్చరించిన అక్రమ నిర్మాణం ఆపకపోవడంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు శనివారం ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫారెస్ట్ కేంద్రం ఆకస్మిక తనిఖీ



భాకరాపేట ఫారెస్ట్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న స్క్వాడ్ డీఎఫ్‌వో

సిద్దవటం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి భాకరాపేట గ్రామంలో ఫారెస్ట్ తనిఖీ కేంద్రాన్ని శనివారం స్క్వాడ్ డీఎఫ్‌వో టి.శేఖర్‌బాబు ఆకస్మిక తనిఖీ చేపట్టి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా శేఖర్‌బాబు మాట్లాడుతూ ఫారెస్ట్ తనిఖీ కేంద్రంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని తనిఖీ చేపట్టాలన్నారు. ప్రపంచంలోనే అత్యంత విలువైన ఎర్రచందనాన్ని కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. సిద్దవటం, కడప, ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని తనిఖీ కేంద్రాల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి వేళల్లో తనిఖీలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్క్వాడ్ రేంజర్ మదన్‌మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



స్మగ్లర్, ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ సిబ్బంది

ఓబులవారిపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాదెల అటవీ ప్రాంతంలో తమిళనాడు ప్రాంతానికి చెందిన స్మగ్లర్‌ను అరెస్టు చేసి 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వేకోడూరు ఫారెస్ట్ రేంజర్ శ్యామ్‌సుందర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం గాదెల అటవీ ప్రాంతంలో తనిఖీ చేస్తుండగా ఊరగాయకొండ పరిధిలో తమిళనాడులోని తిరువన్నామలై జిల్లాకు చెందిన ఆనందన్‌రాజ్ జయశంకర్ అనే స్మగ్లర్‌ను పట్టుకున్నామన్నారు. అలాగే ఎనిమిది దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎంవీ రమణ, మహేష్‌కుమార్, ఫారెస్ట్ బీట్ అధికారులు జనార్దన్, పీరయ్య, నాగేశ్వరనాయక్, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యలో నూతన సంస్కరణలు

● ఇంటర్ విద్య జిల్లా అధికారి రవి

రాయచోటిటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యలో నూతనంగా తీసుకొచ్చిన సంస్కరణలపై అధ్యాపకులకు అవగాహన అవసరమని ఇంటర్ విద్య జిల్లా అధికారి ఎస్.రవి తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఇంటర్ విద్య జిల్లా కార్యాలయంలో యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఈ విద్యా సంవత్సరం కొత్తగా తీసుకొచ్చిన సంస్కరణలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిలబస్ మార్పు, సబ్జెక్టు కలయిక (కాంబినేషన్) ప్రశ్నపత్రంలో మార్పుల గురించి వివరించారు. ఇంటర్ చదివే విద్యార్థులు ప్రధానంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ గ్రూపులు తీసుకుంటారన్నారు. ఈ గ్రూప్ సబ్జెక్టులతో పాటు పార్ట్-1గా ఇంగ్లీషు, పార్ట్-2లో ద్వితీయ భాషగా తెలుగు, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, తమిళ, కన్నడ, ఒరియా, పర్షియన్, ఫ్రెంచ్ గానీ, ప్రధాన సబ్జెక్టులైన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమెస్ట్రీ, బయాలజీ, హిస్టరీ, ఎకనామిక్స్, కెమెస్ట్రీ, సివిక్స్ గానీ, మైనర్ సబ్జెక్టులైన జియోగ్రఫీ, లాజిక్, పబ్లిక్, అడ్మినిస్ట్రేషన్, మోడర్న్ లాంగ్వేజ్ ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూల్లో ఏదైనా ఒక సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు.

ఎంపీసీ విద్యార్థులు అడిషినల్‌గా (6వ సబ్జెక్టుగా) ఆప్షనల్ సబ్జెక్టు బయాలజీ, బైపీసీ విద్యార్థులు అడిషనల్‌గా (6వ సబ్జెక్టుగా) ఆప్షనల్ సబ్జెక్టు మ్యాథ్స్ ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఈ అడిషనల్ సబ్జెక్టును విద్యార్థులు సొంతంగా చదువుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మ్యాథ్స్-ఎ, మ్యాథ్స్-బీ సబ్జెక్టులను విలీనం చేసి మ్యాథ్స్ సబ్జెక్టుగా, బాటనీ, బయాలజీ సబ్జెక్టులను విలీనం చేసి బయాలజీ సబ్జెక్టుగా ఈ ఏడాది మొదటి సంవత్సరం విద్యార్థులకు అమలు చేస్తారన్నారు. ద్వితీయ సంవత్సరంలో గ్రూప్‌లో కానీ, సబ్జెక్టుల విలీనం కానీ, ప్రశ్నపత్రంలో మార్పులు కానీ చోటు చేసుకోలేదన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలోనూ మార్పులు ఉంటాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఏవైనా అనుమానాలుంటే నివృత్తి చేసుకోవటానికి సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.



ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో రవి

ప్రాజెక్టులున్నా.. నీరు సున్నా...

● సమస్యల వలయంలో రైల్వేకోడూరు
● జిల్లా కేంద్రానికి ఒక్క బస్సూ లేదు...
● మంత్రి గారూ... మీరైనా పట్టించుకోండి...

రైల్వేకోడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఆదివారం నియోజకవర్గంలో పర్యటించనున్న సందర్భంగా నియోజకవర్గంలో ప్రాజెక్టులతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో వాగేటికోన, గొట్టిమానుకోన, చాకిరేవుకోన తదితర మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులున్నాయి. ఈ ప్రాజెక్టులకు ప్రతి ఏటా పనులు జరుగుతున్నా రైతుల పొలాలకు నీరందించిన పాపాన పోలేదు. ఈ ప్రాజెక్టులు కాంట్రాక్టర్లకు కల్పతరువులుగా మారుతున్నాయి. ఓబులవారిపల్లె మండలంలోని గాదెల సమీపంలో బండిరేవులకోన ఉంది. 30 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టును పట్టించుకున్న పాపానపోలేదు. చాలాసార్లు గత ఎమ్మెల్యేలు పరిశీలించినా ప్రయోజనం కనిపించలేదు.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో కాంట్రాక్టర్లకు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కాసులు కురిపిస్తున్నాయి. రైల్వేకోడూరు నియోజకవర్గానికి మరో కోనసీమగా పేరు ఉంది. ఇక్కడ మామిడి, బొప్పాయి, అరటి తదితర పంటలను రైతులు పండిస్తున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ఇక్కడి రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచి నాణ్యమైన పంటలను పండిస్తున్నా గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. అనంతరాజుపేట వద్ద అప్సా జ్యూస్ పరిశ్రమ ఉంది. ఇది మూతపడి 25 ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకు పునఃప్రారంభానికి పాలకులు ప్రయత్నాలు చేయలేదు. రైల్వేకోడూరులో రైతులకు శీతల గిడ్డంగులు లేని కారణంగా పంటను దాచుకుని గిట్టుబాటు ధరలు వచ్చి అమ్ముకోవడానికి వీలుగా ఉంటుందని చాలాసార్లు పాలకులకు విన్నపాలు చేసుకున్నా ఫలితం శూన్యం. రైల్వేకోడూరు నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటికి ఒక్క బస్సు కూడా లేదు. అది కూడా రాయచోటికి వెళ్లి రావాలంటే ఒక్కరోజు సమయం పూర్తిగా అయిపోతోంది. ప్రజలు అష్టకష్టాలుపడి రాయచోటికి చేరుకుంటున్నారు. కలెక్టర్, ఎస్పీ తదితర కార్యాలయాలకు వెళ్లి రావాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. రైల్వేకోడూరును బాలాజీ జిల్లాలో కలపాలని ఏళ్ల తరబడి ప్రజలు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వైసీపీ ప్రభుత్వంలో కూడా రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలపాలని నాయకులు పట్టుబట్టినా ఎవరూ పట్టించుకోలేదు. జిల్లాల పునర్విభజన కమిటీలో ఉన్న మీరైనా మా గురించి పట్టించుకోండని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.



వాగేటికోన మైనర్ ప్రాజెక్టు కట్టాల్సిన ప్రాంతం



మూతపడిన అప్సా జ్యూస్ ఫ్యాక్టరీ

రైల్వేకోడూరు నియోజకవర్గ కేంద్రంలో గుంజనేరు, ముష్టేరు, గుండాలేరు తదితర నదులు ఉన్నాయి. వీటికి రక్షణ గోడలు లేక వ్యవసాయ భూములు కోతకు గురి కావడమే కాకుండా నదీపరివాహక ప్రాంతాల్లో నివాసాలు ఉన్నా ప్రజల ఇళ్లు భారీ వర్షాల కారణంగా కొట్టుకునిపోతున్నాయి. నాలుగు లేన్ల దారి పనులు మొదలు కాలేదు. దీంతో భారీ వాహనాలు మొత్తం రైల్వేకోడూరు మీదుగా వెళుతున్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. ప్రతి ఏటా ఏనుగులు పంట పొలాలపై పడి నాశనం చేస్తున్నాయి. దీని పరిష్కారం చేయాలని ప్రభుత్వాలకు చాలా ఏళ్లుగా విన్నపాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. శనివారం ఓబులవారిపల్లె మండలంలోని మంగంపేటకు తొలిఅడుగు కార్యక్రమానికి హాజరవుతున్న నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నియోజకవర్గ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కండిషన్ లేని బస్సులు..
ప్రయాణికుల పాట్లు

మూడేళ్లుగా ఎంఎఫ్ సీటు ఖాళీ.. ● షెడ్యూలు ప్రకారం బస్సులు నడవడం కూడా అనుమానమే..

"సురక్షిత ప్రయాణం ఆర్టీసీ లక్ష్యం.." "ఆర్టీసీ బస్సులో ప్రయాణించండి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోండి" అన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నినాదాలు కడప ఆర్టీసీ డిపో పరిధిలో అపహాస్యంగా మారుతున్నాయి. ఈ డిపో నుంచి బయలుదేరిన బస్సు గమ్యస్థానానికి సక్రమంగా చేరుతుందా.. ఒకవేళ చేరినా డిపోకు తిరిగి వస్తుందా అన్న విషయంపై డిపో సిబ్బందే సంశయం వ్యక్తం చేస్తుండడంతో ప్రయాణికులు అవాక్కవుతున్నారు. కండిషన్ లేకపోవడం కారణంగా షెడ్యూలు ప్రకారం బస్సులు నడవకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులకు ఆదాయంపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.


బస్సుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది


కడప ఆర్టీసీ బస్టాండు ముఖద్వారం

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడప ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్టీసీకి చెందిన బస్సులు 86, 48 అద్దె బస్సులు వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తున్నాయి. కడప-బెంగుళూరు సర్వీసుల కారణంగా ఈ డిపోకు అత్యధికంగా ఆదాయం చేకూరుతోంది. ఇతర రూట్ల సంగతి పక్కన పెడితే, గణనీయంగా ఆదాయాన్ని తెచ్చిపెట్టే ఈ మార్గంలో నడిచే బస్సుల కండిషన్‌లో లోపం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత డిపో యాజమాన్యంపై ఉంది. అయితే, సంబంధిత అధికారులుగానీ, సిబ్బంది గానీ బస్సుల కండిషన్‌పై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొరాయిస్తున్న బస్సులు

పక్షం రోజుల క్రితం కడప డిపో నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బెంగుళూరుకు వెళ్లాల్సిన అమరావతి బస్సు సరైన కండిషన్‌లో లేని కారణంగా సాయంత్రం 6 గంటలకు బయలుదేరింది. దీంతో ఆ బస్సుకు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు గగ్గోలు పెట్టినట్లు సమాచారం. అంతలా బస్సుల కండిషన్ అధ్వాన స్థితికి చేరిందనే విమర్శలున్నాయి.

ఖాళీగా మెకానికల్ ఫోర్‌మన్ పోస్టు

కడప ఆర్టీసీ గ్యారేజీలో 76 మంది రెగ్యులర్ ఉద్యోగులుండగా, మరో 20 మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో ఐటీఐ చేసిన వారే ఎక్కువగా ఉన్నారు వారంతా షిఫ్ట్‌ల ప్రకారం క్లీనింగ్, వాషింగ్, తదితర పనులు చేస్తుంటారు. అయితే, వారికి బస్సుల కండిషన్‌పై అంతగా అవగాహన ఉండదని అంటున్నారు. ఆ అంశంలై పూర్తి అవగాహన కలిగి ఉండే మెకానికల్ ఫోర్‌మన్ పోస్టు మూడేళ్లుగా ఖాళీగా ఉండడంతో, ఆ బాధ్యతలను అసిస్టెంట్ మెకానికల్ ఫోర్‌మెన్ (ఏ.ఎం.ఎఫ్) నిర్వహిస్తున్నాడు. ఆయన నిరంతరం చిర్రుబుర్రు లాడడమే పనిగా పెట్టుకున్నారు తప్ప బస్సుల కండి షన్‌పై దృష్టి సారించడం లేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. దీంతో కడప డిపో నుంచి ప్రయాణికులతో వెళ్లిన బస్సు తిరిగి డిపోకు చేరే వరకూ గ్యారంటీ లేదని గ్యారేజీ సిబ్బందిలో కూడా అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. దీనికి తోడు కడప డిపోలో కాలం చెల్లిన బస్సులే ఎక్కువగా ఉన్నాయనే గుసగుసలున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

కడప డిపోలో మెకానికల్ ఫోర్‌మన్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం. బస్సుల కండిషన్‌ను పరిశీలించి, ప్రయాణి కులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తాం..

- గోపాల్ రెడ్డి, ఆర్ఎం, కడప రీజియన్

హెలిప్యాడ్ ఏర్పాటు పనుల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి

జమ్మలమడుగు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రాక సందర్భంగా జమ్మలమడుగు మండలంలోని అంబవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పక్కన ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను శనివారం ప్రొద్దుటూరు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రమణారెడ్డి, జమ్మలమడుగు ఏడీఈ రాజగోపాల్, ఇతర అధికారులు పరిశీలించారు. జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు టిడ్కో గృహాల వెనుక భాగాన హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన చేశారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదురుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టు 1న ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించే స్థలాలను ఆర్డీవో సాయిశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, సర్వేయర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదాన పథకానికి విరాళం


విరాళం అందిస్తున్న గంజికుంట కుటుంబ సభ్యులు

చక్రాయపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో నిర్వహించే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 విరాళాన్ని అందించారు. శ్రావణ మాసం తొలి శనివారం పురస్కరించుకొని ప్రొద్దుటూరుకు చెందిన గంజికుట రాజమోహన్ జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని వరలక్ష్మి, మనుమడు ఉదయ్ కిరణ్, మనుమరాలు లక్ష్మీప్రియ అందజేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా వీరికి ప్రత్యే క దర్శనం కల్పించడంతో పాటు అర్చకులతో ఆశీర్వచనాలు అందించినట్లు అసిస్టెంట్ కమషనర్ తెలిపారు.

టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు లోమడ సుబ్బలక్షుమ్మ మృతి



చెన్నూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కడప జిల్లా తెలుగుదేశంపార్టీ విశేష సేవలందించిన రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు లోమడ సుబ్బ లక్షుమ్మ(75) శనివారం మృతి చెందారు. చెన్నూరు మండలం శివాలపల్లెకు చెందిన లోమడ సుబ్బారెడ్డితో ఆమెకు వివాహం జరిగింది. .ఈమె ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ఉపాధ్యక్షురాలిగా ఆరేళ్ల పని చేశారు. 1995-97లో స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లాలో మహిళా సమస్యలపై ఎన్నోమార్లు పోరాటాలు చేశారు. గతంలో సుబ్బలక్షుమ్మ చేసిన కృషిని అభినందించేందుకు ప్రస్తుత సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆమె ఇంటికి కూడా వచ్చారు. కాగా, ఈమె భర్త లోమడ సుబ్బారెడ్డి రెండు నెలల క్రితం మృతి చెందగా, శనివారం ఆమె మృతి చెందడంతో టీడీపీ నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె అంత్యక్రియలు చెన్నూరు పెన్నానదీ తీరంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్ ఢీకొని ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలు


చికిత్స పొందుతున్న జయరాం

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిల బైక్ వీలింగ్ కారణంగా ఆర్టీసీ డ్రైవర్ గాయపడ్డాడు. కడప నగరంలోని 49వ డివిజన్ ఆలంఖాన్ పల్లెకు చెందిన జయరాం ఆర్టీసీ డ్రైవర్. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా ఆలంఖాన్‌పల్లె- దండు (కమలా నగర్) మధ్యలో కొందరు రెండు ద్విచక్ర వాహనాలతో వీలింగ్ చేస్తూ జయరాం నడుపుతున్న వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో జయరాం కిందపడిపోయి గాయాలపాలయ్యాడు. స్థానికంగా ప్రథమ చికిత్స చేయించుకుని శనివారం ఉదయం కడప ఆర్ఎం కార్యాలయం సమీ పంలోని ఆర్టీసీ ఏరియా ఆసుపత్రిలో వైద్యసేవలు పొందారు. కొన్ని నెలలుగా ఆకతాయిలు ఇష్టానుసారంగా ద్విచక్రవాహనాలను డ్రైవింగ్ చేస్తూ రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బైక్ ముందు చక్రాన్ని పైకెత్తి వెనుక చక్రం మీద వెళుతూ ఈలలు.. కేకలు వేయడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి రహదారులపై ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

ముద్దనూరు జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చెన్నారెడ్డిపల్లె సమీపంలోని రైలు పట్టాలపై శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మృతదేహంపై తెలుపు రంగు ప్యాంటు, తెలుపు రంగు కట్ బనియన్ ఉందని, వయసు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందన్నారు. ఇతను ప్రమాదవశాత్తూ మృతి చెందాడా, ఆత్మహత్య చేసుకున్నాడా అన్న విషయం విచారణలో తేలాల్సి ఉందన్నారు. ఇతర వివరాల కోసం 9440627658 సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో భరత్‌యాదవ్ అరెస్టు

పులివెందుల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం చేసిన కేసులో భరత్‌యాదవ్‌ను శనివారం అరెస్టు చేసినట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. దిలీప్‌కుమార్ హత్యకేసులో రాజీ కావాలంటూ శుక్రవారం ఆయన తల్లి మస్తానమ్మను భరత్‌యాదవ్ బెదిరించడంతోపాటు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, శనివారం నిందితుడిని అరెస్టు చేసి పులివెందుల సివిల్ కోర్టు జడ్జి ముందు హాజరుపరచగా, జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ వివరించారు

గంజాయి విక్రేతల అరెస్టు

● నాలుగు కేజీల గంజాయి స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కడప ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్

కడప క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్నట్లు సమా చారం అందడంతో కడప నగరంలోని పుట్లంపల్లె చెరువు వద్ద దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు కడప ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. కడప ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో శనివారం విలేక రులకు వివరాలు వెల్లడించారు. సీకేదిన్నె మండలం మామిళ్లపల్లెకు చెందిన రావులకొల్లు అజయ్ బద్వేలు టౌన్ రిక్షా కాలనీకి చెందిన కావడి శ్రీను, కడప ఇందిరానగర్‌కు చెందిన గంప మహేశ్, శివానందపురానికి చెందిన షేక్‌హుసేన్‌వలి, ప్రకాశ్‌నగర్‌కు చెందిన మల్లి, ఖాదర్ మొహిద్దీన్‌లు ఇతర రాష్ట్రాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి, వాటిని ప్యాకెట్ల రూపంలోకి మార్చి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఆ మేరకు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి, 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల దాడుల సందర్భంగా పరారైన వారిని కూడా అరెస్టు చేసినట్లు వివరించారు.

భార్య చంపుతానని బెదిరించిందని భర్త ఫిర్యాదు

చెన్నూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తన భార్యే తనను చంపుతానని బెదిరించిందంటూ శివాలపల్లెకు చెందిన సుబ్బరాయుడు శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. శివాలపల్లెకు చెందిన బత్తుల సుబ్బరాయుడుకు భార్య శ్రీలతతోపాటు కుమారుడు ఉన్నారు. మూడు నెలల క్రితం ఇంట్లో 14 తులాల బంగారంతో తన స్వగ్రామమైన నంద్యాలకు వెళ్లి ఆమె తిరిగి రాకపోవడంతో, భర్త ఫోన్ చేసి ఆరా తీశాడు. ఇంటికి రావాలని కోరాడు. దాంతో ఆమె తాను సాయిగణేశ్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్నానని, తాను తీసుకు వచ్చిన బంగారం అతనికి కట్నంగా ఇచ్చానని, ఇక నీ దగ్గరకు రానని, అక్కడే ఉంటానని, కొడుకును బాగా చూసుకుంటానని చెప్పింది. గట్టిగా మాట్లాడితే చంపుతానని బెదిరించిందని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

● డీఆర్వో విశ్వేశ్వరనాయుడు


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

చెన్నూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. చెన్నూరులో శనివారం చెన్నూరు యువత ఆధ్వర్యంలో స్థానిక చౌడేశ్వరి ఆలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ విచ్చేసిన డీఆర్వో మాట్లాడుతూ రక్తదానం అనేది పుణ్యకార్యంగా భావించాలన్నారు., చెన్నూరు యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. రక్తదానంపై పలురకాల అపోహలు ఉంటాయని, వాటిని వదులుకుని సమాజ సేవలో భాగంగా ఆరోగ్యవంతమైన యువత ఏడాదిలో మూడు మార్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్తదానం చేయవచ్చన్నారు. దీంతో శరీరంలో మరింత చురుకుదనం పెరిగి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రవిబాబు రక్తదానం చేసిన యువతను అభినందించారు. అలాగే యువకులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇద్దరు మహిళలతో సహా 74 మంది రక్తదానం చేయగా, వారందరికీ ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు సరస్వతి, కోఆర్డినేటర్లు ఉట్టి శ్రీకాంత్, సునీల్, డీపీఎం భాస్కర్, మెడికల్ ఆఫీసరు వినయ్‌కుమార్‌రెడ్డి, చౌడేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు సుధామూర్తి, జేబీవీఎస్ అధ్యక్షుడు అశోక్, గుగ్గిళ్ల చాణక్య, పెడబల్లి శ్రీకాంత్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఓట్లు మావే.. సీట్లూ మావే !

● ఆత్మీయ సమావేశంలో బీసీ కులాల నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఓట్లు మావే.. సీట్లు కూడా మావే అనే నినాదంతో బీసీ వర్గాలను జాగృతం చేసి, రానున్న ఎన్నికల నాటికి శాసించే శక్తిగా మారుస్తామని బీసీ కులాల వేదిక నాయకులు ప్రకటించారు. స్థానిక పాతరిమ్స్‌లోని బీ.సీ.భవన్‌లో శనివారం రాయలసీమ జిల్లాల్లోని బీసీ కులాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పార్టీ ఎన్నికల ముందు బీసీల సంక్షేమానికి కృషి చేస్తామని గొప్పలు చెప్పడం.. గద్దెనెక్కగానే గాలికొదిలేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటివరకూ స్థానికంగా అధిక జనాభా గల కులాలకు మాత్రమే అన్ని పార్టీలు అవకాశం కల్పించాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అధిక జనాభా ఉన్న కులాలకు ప్రాధాన్యం లభించలేదన్నారు. ఇప్పటివరకూ రాజ్యాధికారంలో భాగస్వామ్యం లేని బీసీ కులాలను అసెంబ్లీ, పార్లమెంట్‌లోకి తీసుకుని పోయేలా బీసీల్లో చైతన్యం తెస్తామన్నారు. దాదాపు 150కి పైగా గల బీసీ కులాల్లో కేవలం ఐదారు కులాలకే పార్టీలన్నీ ప్రాధాన్యం కల్పిస్తున్నాయని, మిగిలిన కులాలను డబ్బులు లేవనో, జనాభా లేదనో చట్టసభలలో అవకాశం కల్పించడం లేదన్నారు. ఇక నుంచి అన్ని కులాలకు రాజ్యాధికారంలో అవకాశం కల్పించడమే లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

కార్యక్రమంలో బీసీ కులాల వేదిక నాయకులు ఇంటూరి బాబ్జి (నాయీ బ్రాహ్మణ సంఘం) జి. లలిత్ ప్రజాపతి (కుమ్మర శాలివాహనసంఘం) ఎస్ సాంబశివరావు (అగ్నికుల క్షత్రియ సంఘం) పి. మనోజ్‌కుమార్ (సంచార జాతుల సంఘం) సుబ్బయ్య, (దాసరి సంఘం) బద్వేల్ గురుమూర్తి (రజక సంఘం) తదితరులతోపాటుగా పలువురు బీసీ కులాల నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

● ఏడీఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి


ఆర్ఎస్‌కే సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

పులివెందుల రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విచక్షణా రహితంగా రసాయన ఎరువుల వినియోగంతో నిస్సారంగా మారిన నేలకు జవజీవాలందించడంతోపాటు, ఆరోగ్యకరమైన పంటలు అందించే ప్రకృతి వ్యవసాయం వైపు ఆకర్షితులయ్యేలా రైతుల్లో చైతన్యం తీసుకురావాలని పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు అంబవరం ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడులు ఎక్కువ కావడానికి విచ్చలవిడిగా రసాయన, పురుగు మందుల వాడకమే కారణమన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంతో తక్కువ పెట్టుబడితోనే పంటలు పండించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పండించే పంటలకు మంచి ధర కూడా దక్కుతుందన్న విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన ప్రతి పైరును ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి రైతుతో ప్రధాన మంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. చీడపీడలను గుర్తించి సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నత్రజని ఎరువులు అనవసరంగా వాడితే చీడపీడల ఉధృతి పెరిగి పంట దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ, అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు చెన్నారెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఓబులేసు, చంద్రశేఖర్‌రెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో అనంతపురం, చిత్తూరు జట్లు

● హోరాహోరీగా ఏసీఏ అండర్-16 మెన్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం- కర్నూలు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 210 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 51.3 ఓవర్లలో కేవలం 125 పరుగులకే కుప్ప కూలింది. దీంతో రెండవ రోజున బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. సాత్విక్ 131 పరుగులు చేయడంతో అనంతపురం జట్టు 342 పరుగుల ఆధిక్యత సాధించింది.

నగర రిమ్స్ సమీప ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు- నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లో చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 76.3 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 21 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 70 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 70 పరుగులతో రెండవ రోజున బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 103.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సుశాంత్ 60 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉండగా మరో బ్యాటర్ చైతన్య 52 పరుగులు చేశారు. రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 40 పరుగులు చేసింది. ఇందులో హర్ష 21 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో చిత్తూరు జట్టు 22 పరుగుల స్వల్ప స్కోర్ ఆధిక్యంలో నిలిచింది.

29న ఈశ్వరీదేవి జయంత్యుత్సవాలు


ఈశ్వరీదేవి మఠం ప్రాంగణం

బ్రహ్మంగారిమఠం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఈశ్వరీ దేవి అమ్మవారి 322వ జయంతి సందర్భంగా జూలై 29న ఈశ్వరీదేవి మఠం ప్రాంగణంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మఠాధిపతి శ్రీవీర శివకుమార స్వామి తెలిపారు. శనివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ అష్టోత్తర శత సామూహిక కలశోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు రూ.516లు సమర్పించి పేర్లను నమోదు చేయించుకున్న వారికి గోత్రనామాలతో అర్చన, కలశ పూజ చేసి, వస్త్రం, కొబ్బరికాయ, కలశాన్ని ఇస్తామన్నారు. కార్యక్రమాలన్నీ కార్యనిర్వాహణాధికారి బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

వేంపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్త పిలుపునిచ్చారు. శనివారం ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పరిపాలన అధికారి పెనుగొండ రవి, కోనప్ప, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు





ప్రత్యేక అలంకరణలో చెన్నూరు ప్రసన్న వేంకటేశ్వరుడు, పైడికాలువ.. చెన్నకేశవుడు, సీకే దిన్నె... బండలాడుగు పోటీలను ప్రారంభిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

సీకేదిన్నె, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : చింతకొమ్మదిన్నె మండలంలో శ్రావణమాసం పూజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అప్పరాజుపల్లె గ్రామంలో అభయ హస్త ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి సుగంధద్రవ్యాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆకుపూజ, సుదర్శనహోమం నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో గోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించి భక్తులకు కనువిందు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి దర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలు లాంచనంగా ప్రారంభించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చెన్నూరు..: శ్రావణమాసం తొలి శనివారం సందర్భంగా స్థానిక ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయంలో మూలవిరాట్ వేంకటేశ్వరుడికి శ్రావణమాస తొలి శనివారం పూజలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాల్లో పలురకాల అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు,అలంకారాలు చేశారు. ఈసందర్భంగా ఆలయంలో గోవిందనామాలు, విష్ణు సహస్ర నామ పారాయణంచేసి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు గరుడసేవ నిర్వహిచారు. స్వామివారి మూలవిరాట్‌ను గరుడమూర్తిపై నిలిపి పల్లకీసేవ నిర్వహించారు.

వల్లూరు..: శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో మండలంలోని ఆలయాల్లో శ్రావణ మాస శోభ సంతరించుకుంది. శ్రావణ మొదటి శనివారం కావడంతో భక్తులు కాయకర్పూరం చెల్లించారు. అందులోభాగంగా పైడికాల్వలోని రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవాలయంలో రాహుకాల అభిషేకాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అలాగే పుష్పగిరిలోని చెన్నకేశవాలయంలో శ్రావణ మాస ఉత్సవాలను స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

వీరపునాయునిపల్లె..: మండలంలోని వీరాంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాసం తొలిశనివారం పురస్కరించుకొని పూజలు చేశారు. మండలంలోని వీరాంజనేయ, అభయాంజనేయస్వామి ఆలయాల్లో పూజలు జరిపించి నైవేద్యం స్వీకరించారు.

కాలినడకన...: శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా పలుగ్రామాల నుంచి గండి క్షేత్రానికి భక్తులు కాలినడకన బయలుదేరి వెళ్లారు. పలు గ్రామాల నుంచి మహిళలు, పిల్లలు, పురుషులు బయలుదేరి గండి అంజన్నను దర్శించుకునేందుకు వెళ్లారు.

దశరథస్వామి ఆలయంలో అన్నదానం

చక్రాయపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం పురస్కరించుకొని శనివారం మండలంలోని రాయచోటి-వేంపల్లె మెయిన్ రోడ్డులో వెలసిన దశరథమహారాజు స్వామి దేవస్థానంలో అన్నదానం నిర్వహించారు. దశరథ స్వామి భక్తుల కొంగుబంగారం గా పూజలందుకుంటున్నారు. దశరథ మహారాజుస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రావణమాసంలో అన్నదానం కార్య క్రమం ఏర్పాటుచేయడంతో పాటు గండి అంజన్నను దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు భోజనం అందిస్తు న్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ గంజి అన్న య్య వారి కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్త సోము రామసుబ్బయ్య, మాజీ సర్పంచు సానె సుబ్బరామయ్య, కువైట్ సిద్దయ్య, మేడిశెట్టి రెడ్డయ్య, దుగ్గిరెడ్డి ఆనంద్, భక్తులు పాల్గొన్నారు.



చక్రాయపేట...దశరథ మహారాజస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం

ద్విచక్రవాహనం ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు

కమలాపురం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం వద్ద కడప- తాడిపత్రి జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మర్రి రాజశేఖర్ కుతీవ్ర గాయాలైనట్లు హెడ్‌కానిస్టేబుల్ కొండారెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి మండలం బుడ్డాయపల్లెకు చెందిన రాజశేఖర్ రామచంద్రాపురం వద్ద ఉన్న ఆర్సీయం పాఠశాలలో పదో తరగతి చదివాడు. శనివారం తన సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు ద్విచక్ర వాహనంలో పాఠశాలకు వెళుతుండగా అదే సమయంలో ముద్దనూరుకు చెందిన తుమ్మలూరు శ్రీనాథరెడ్డి ద్విచక్రవాహనంలో ఎర్రగుంట్ల వైపు వెళుతూ ఢీకొన్నాడు. దీంతో రాజశేఖర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆ మేరకు కేసు నమోదు చేసి 108లో చికిత్స నిమిత్తం కడపకు తరలించినట్లు హెడ్‌కానిస్టేబులు తెలిపారు.

కడప ఎంఈఓ-1గా రఫిక్ అహ్మద్ బాధ్యతల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడప ఎంఈఓ-1గా రఫిక్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఎమ్మార్సీలో ఎంఈఓ-1 బాధ్యతలను ఆయన చేపట్టారు. కడప శంకరాపురం ప్రభుత్వ అంధుల పాఠశాల గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ రఫిక్ అహ్మద్‌ను కడప ఎంఈఓ-1గా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) నిర్వహించనున్నారు. రఫిక్ అహ్మద్ బాధ్యతలు చేపట్టిన అనంతరం డీఈఓ షంషుద్దీన్‌ను కలిశారు.

కడప నగరపాలక సంస్థ ఈఈగా విజయ్‌కుమార్‌రెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడపనగరపాలక సంస్థలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విజయ్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు శనివారం కార్పొరేషన్ ఈఈ చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. కార్పొరేషన్‌లో ఈఈగా విధులు నిర్వహించిన నారాయణస్వామి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఈఈగా విజయ్‌కుమార్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది.

కేజీబీవీ ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను వాయిదా వేయాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ఉపాధ్యాయులకు త్వరలో నిర్వహించబోనున్న శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. త్వరలో ఎఫ్ఏ-1 పరీక్షలు జరగనున్న సందర్భంగాఈ శిక్షణకార్యక్రమాల వల్లబోధనలో ఆటంకం కలిగే అవకాశంఉందన్నారు.

ఉపాధ్యాయుల పొజిషన్ సర్టిఫికెట్ క్రియేట్ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం

కడప ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పొజిషన్ సర్టిఫికెట్ క్రియేట్ చేయడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని బహుజన టీచర్స్ యూనియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (బీటీయూ ఏపీ) సంఘ నాయకులు మండిపడ్డారు. శనివారం కడప నగరం జిల్లా విద్యాశాఖ అధికారినికలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున, రాష్ట్ర ట్రెజరర్ ఆకుమళ్ల రాజబాబు, జిల్లా అధ్యక్షుడు ఎం.గంగరాజు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో జాప్యమెందుకు?



కడప ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బదిలీపొందిన ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో జాప్యమెందుకని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. శనివారం సాయంత్రం కడప డీఈఓ కార్యాలయం ఎదుట బదిలీ పొందిన ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేయడాన్ని వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ రాష్ట్రకమిటీ పిలుపుమేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నాకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సం ఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటసుబ్బారెడ్డి మద్దతు తెలిపారు. జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డి.కృష్ణారెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యుడు గంగన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు నేడూ చెల్లించవచ్చు

కడప నాగరాజుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. విని యోగదారుల సౌకర్యార్థం పనిచేస్తాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీసీఆర్‌బీ కార్యాలయాన్ని ప్రారంభించిన కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్

కడప క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయంలో ఉన్న డీసీఆర్‌బీ ని ఇటీవల పునరుద్ధరించారు. ఈ నేపథ్యంలో డీసీఆర్‌బీ కార్యాలయాన్ని శనివారం క ర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్, ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం పునరుద్ధరించిన డీసీఆర్‌బీ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టరు ఈశ్వర్‌రెడ్డి, ఎస్ఐ టీవీ క్రిష్ణయ్య, ఏఎస్ఐ రామచంద్రరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాలెట్ పేపర్‌ద్వారా ఎన్నికలు నిర్వహించాలి

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యవినాశనానికి, విధ్వంసానికి దారితీసేలా కారణమౌతున్న ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని మహాజన రాజ్యంపార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు నంగటి మనోహర్ కోరారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఈవీఎంలు వద్దు-బ్యాలెట్ పేపరే ముద్దు అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది సంపత్‌కుమార్, నాయకులు రమణ, వెంకటశివ, సలావుద్దీన్, రవిశంకర్‌రెడ్డి, మహబూబ్‌బాష, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

వల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని భాకరాపురం గ్రామంలో సిమెంటు రోడ్డును ఆక్రమించి కట్టిన కట్టడంపై గ్రామస్థులు తహసీల్దారు శ్రీవాణికి కొన్నిరోజులు క్రితం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దారు అన్నికోణాల్లో పరిశీలించి సంబంధిత వీఆర్వోలు పరిశీలించాలని ఆదేశించారు. వీఆర్వో సంఘటనాస్థలం వద్దకు వెళ్లి రోడ్డుకు అడ్డంగా కట్టారని నివేదిక ఇవ్వడంతో శనివారం తహసీల్దారు శ్రీవాణి రెవెన్యూ, పోలీసు సిబ్బంది సహకారంతో రోడ్డుపై అడ్డంగా కట్టిన అక్రమ కట్టడాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు.

తేలికపాటి దుక్కులతో సాగు లాభదాయకం

కమలాపురం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : తేలికపాటి దుక్కులు చేయడం వల్ల సాగులో లాభదాయకంగా ఉంటుందని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందికి జరుగుతున్న శిక్షణ కార్యక్రమం ముగింపులో ఆయన పాల్గొన్నారు. ఏవో ఎం.సరస్వతి, కిరణ్‌కుమారరెడ్డి,ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, కమలాపురం,వల్లూరు రైతు సేవాకేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



శనివారం మృతి చెందిన టీడీపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు సుబ్బలక్షుమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేత దుర్గా ప్రసాద్ తదితరులు

వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడితే మంచిది

ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారాలోకేశ్ గురించి మాట్లాడేటపుడు వైసీపీ నేతలు నోరు అదుపులోకి పెట్టుకొని మాట్లాడితే మంచిదని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం కడపలో వైసీపీ నాయకులు సతీశ్‌రెడ్డి తదితరులు విలేకరులతో మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. సినిమా డైలాగులు చెప్పడం సతీష్‌రెడ్డికే చెల్లిందన్నారు. వైసీపీనేత జగన్ కూడా సినిమా డైలాగులు చెబుతున్నారని, ఈయన కూడా అదే పాటిస్తున్నారన్నారు. వైసీపీలో ఉండి టీడీపీ వారిని పదేపదే విమర్శిస్తున్నారన్నారు. కానీ టీడీపీలో ఉండి ఏరోజైనా వైసీపీని విమర్శించావా అని ప్రశ్నించారు. టీడీపీలో అనేకమార్లు పులివెందుల ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వడం, ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌ను చేశారన్నారు. అంజాద్‌బాషాను పక్కనపెట్టుకొని లోకేశ్‌ను మాట్లాడడం ఏమిటని ప్రశ్నించారు. మీ బంధువైన కడప ఎమ్మెల్యే మాధవిని అంజాద్‌బాషా తమ్ముడు ఏ విధంగా మాట్లాడాడో గుర్తులేదా అని ప్రశ్నించారు.

చంద్రబాబు, లోకేశ్‌పై విమర్శలు చేయడం విడ్డూరం

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ 5 సంవత్సరాల పాలనలో పూర్తిగా గాడి తప్పిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలోకి రప్పించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న చంద్రబాబు, లోకేశ్‌పై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీశ్‌రెడ్డి దుందుడుకు వ్యాఖ్యలు చేయడం దారుణమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శనివారం స్థానిక బిల్టప్ సమీప పుత్తా ఎస్టేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా ఏదేని సమస్యలపై విమర్శలు చేసుకోవడం సహజమన్నారు. కాగా ఎప్పుడైతే రాజకీయరంగంలోకి వైసీపీ అరంగేట్రం చేసినప్పటి నుంచే రాజకీయాలు భ్రష్టుపట్టాయన్నారు. ఇప్పటికైనా దరిద్రపు వాగుడు వాగకుండా వుండాలని, లేదంటే భవిష్యత్తులో ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు.

'సతీశ్‌రెడ్డి... పొలిటికల్ బిజినెస్ మానుకో'



కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పొలిటికల్ బిజినెస్ చేసే పద్ధతి వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సతీశ్ రెడ్డి మానుకోవాలని టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానపు రెడ్డి రవిశంకర్‌రెడ్డి హితవు పలికారు. తెలుగుదేశం పార్టీలో వుంటూ రాష్ట్ర వ్యాపితంగా పాపులర్ అయిన సతీశ్‌రెడ్డి వైసీపీలో చేరి చంద్రబాబు నాయుడును దూషించడం సరైంది కాదన్నారు. రాజకీయాన్ని వ్యాపారంగా మలచుకుని దాదాపు 20 సంవత్సరాలుగా పదవులు, పేరు సంపాదించుకున్న తర్వాత లోకేశ్‌పై వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా వుందన్నారు. శనివారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవిశంకర్‌రెడ్డి మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్‌పై సతీశ్‌రెడ్డి అనుచిత వాఖ్యలు చేయడం సబబుగా లేదన్నారు.

మేదరులకు ఊతమిచ్చేలా ప్రభుత్వ భూముల్లో వెదురు

జిల్లా నూతన మేదర కమిటీ ప్రమాణ స్వీకారంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప మారుతీనగర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మేదరుల కులవృత్తిని ప్రోత్సహించేలా జిల్లాలోని ప్రభుత్వ భూముల్లో వెదురును పండింప చేసి తద్వారా మేదరులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు వీలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి మేదరులకు హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ మేదర (మహేంద్ర) సంఘం సారథ్యంలో శనివారం స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానంలో నూతనంగా ఎన్నికైన జిల్లా మేదర సంఘం ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన హాజరై మాట్లాడారు. గత వైసీపీ 5 సంవత్సరాల పాలనలో జిల్లాలో ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జా చేసేలా పాలన సాగిందన్నారు. దీంతో టార్చ్ లైట్ వేసుకుని ఎక్కడ ప్రభుత్వ భూములున్నాయా అని వెతుకులాడే పరిస్థితి దాపురించిందన్నారు. ఇదిలావుండగా టీడీపీ ఆవిర్భావం నుంచి కూడా బీసీ వర్గాల పక్షపాతిగా సాగుతోందన్నారు. అనంతరం జిల్లా నూతన మేదర (మహేంద్ర) సంఘం జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడుగా టంగుటూరి భాస్కర్, మహిళా అధ్యక్షురాలిగా సాగరిక, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌బాబు, ట్రెజరర్‌గా టి.ఎల్లాలు, ప్రచారకార్యదర్శిగా వెంకటశివయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిరిగిరి నారాయణ, గౌరవాధ్యక్షుడుగా కె. వెంకటసుబ్బయ్య, నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీ మేదర (మహేంద్ర) సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధానకార్యదర్శి పి. నాగరాజు, ట్రెజరర్ వైకుంఠరావు, ప్రచార కార్యదర్శిగా టి. సంజీవరాయుడు, మేదరులు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండకు పోటెత్తిన భక్తులు

కడప కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి):శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా పుట్లంపల్లె సమీప కొండపై వెలసిన పాలకొండరాయస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అందుకు అనుగుణంగా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పాలకొండరాయ దర్శనానికి బారులు తీరారు. పాల ప్యాకెట్లను వెంట తీసుకుని కొండపైన చిన్నపాటి జాలుతో కొండపైకి చేరుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ధర్మప్రచారమండలి సభ్యుడు ఏటూరు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న ఏటూరి రామచంద్రారెడ్డి

అమరవీరులకు కొవ్వొత్తుల నివాళి

జమ్మలమడుగు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో శనివారం రాత్రి కార్గిల్‌యుద్ధంలో అమరులైన వీరజవాన్లను స్మరించుకుంటూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం గండికోట చారిటబుల్ ట్రస్టు, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1999 జూలై 26న పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ పోరాటంలో విజయం సాధించిన దినాన్ని స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా అమరసైనికుల గుర్తుగా కార్గిల్ విజయ్ దివస్‌గా ఘనంగా స్మరించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, గండికోట చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వై.చంద్రశేఖర్‌రెడ్డి, బి.రాజగోపాల్‌రెడ్డి, మద్దిలేటి, పాస్టర్ దూల డేవిడ్, జయపాల్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో అమరవీరులను స్మరిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పోరుమామిళ్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యూల్ డేవిడ్‌రాజ్ అధ్యక్షతన శనివారం కళాశాలలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి వీరజవాన్లకు జోహార్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత జవాన్ల వీరోచిత పోరాటం నేటి విద్యార్థులకు స్ఫూర్తి కావాలన్నారు. సైనికుల గొప్పతనాన్ని, వారి త్యాగనిరతిని, దేశానికి చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల కార్యాలయంలో..

స్థానిక మాజీ సైనికుల కార్యాలయంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎయిర్‌మాన్ సీబీఆర్ ప్రసాద్, ఎన్‌ఎక్స్ సీసీ లింగాల జగన్‌రెడ్డి, కల్నల్ రాంబాబు, రవి, భక్తవత్సలరెడ్డి, జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసరు మేజరు కార్తీక్, రాముడు, వెంకటయ్య పాల్గొన్నారు. దేశం కోసం కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ కార్గిల్ విజయ్ దివస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికులు, తదితరులు పాల్గొన్నారు.

'వీరజవాన్‌ల త్యాగాలను స్మరించుకొందాం'

మైదుకూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి అమరులైన సైనికులను స్మరించుకుందామని కార్గిల్ యుద్ధ వీరుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్థానిక వీఆర్ కళాశాలలో శనివారం భారత ప్రభుత్వ క్రీడా మంత్రిత్వశాఖ, మైభారత్, అమ్మసేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. జూలై 26వ తేదీన దేశ వ్యాప్తంగా కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికులు కందనూరు గోపి, జనవిజ్ఞాన వేదిక ఖాజా హుసేన్, ఇమ్మిడిశెట్టి సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



మైదుకూరులో సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

వృద్ధులను బురిడీ కొట్టించి బంగారు ఆభరణాల చోరీ

ప్రొద్దుటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూరోడ్డులో నివాసముంటున్న బద్వేలు గురివిరెడ్డి, లక్ష్మీదేవి వృద్ధ దంపతులను గుర్తుతెలియని వ్యక్తి వచ్చి వారికి దివ్యాంగుల పెన్షన్ ఇప్పిస్తానని చెప్పి బురిడీ కొట్టించి బంగారు ఆభరణాలు చోరీ చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గురివిరెడ్డి, లక్ష్మీదేవిలకు సంతానం లేదన్నారు. లక్ష్మీదేవికి వృద్ధాప్య పింఛను వస్తుందన్నారు. అయితే శనివారం ఒక వ్యక్తి సచివాలయం నుండి వస్తున్నానని చెప్పి మీకు పింఛను సక్రమంగా అందుతుందా అని ప్రశ్నించాడన్నారు. వికలాంగ పింఛను పెడితే ఎక్కువ పింఛను వస్తుందని, ఇందుకు మున్సిపాలిటీకి వెళితే సర్టిఫికేట్ ఇస్తారని, దాంతో వికలాంగ పెన్షన్‌కు అప్లై చేస్తానని తెలిపాడన్నారు. దీంతో గురివిరెడ్డి భార్యను ఒంటరిగా వదిలేసి మున్సిపాలిటీకి బయలు దేరాడన్నారు. గురివిరెడ్డితో పాటు బయటికి వచ్చినట్లే వచ్చి తిరిగి ఇంట్లోకి వెళ్ళి లక్ష్మీదేవితో ఫోటో తీసుకోవాలని తెలిపాడన్నారు. మెడలో, చేతులకు ఉన్న బంగారు కనపడితే పింఛను రాదని, వాటిని పక్కకు తీసిపెట్టాలని తెలిపడంతో ఆమె వాటిని తీసి పక్కన పెట్టిందన్నారు. ఇదే అదనుగా లక్ష్మీదేవిని పక్కన వున్న రూములోకి నెట్టేసి బంగారు ఆభరణాలతో గుర్తుతెలియని వ్యక్తి అక్కడి నుండి ఉడాయించారన్నారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులకు తెలపడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎస్సీ లబ్ధిదారుల భూములను ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం వారు తహసీల్దార్‌కు వినతిప త్రం అందించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ మండలంలోని అనంతరాజపురం గ్రామంలో ఎస్సీలకు కేటాయించిన భూములలో కొంతమంది కంపచెట్లు తొలగించి పొలము తయారు చేస్తున్నారని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాల న్నారు. ఎస్సీలకు కేటాయించిన భూములు వారికే చెందేలా చూడాలని కోరారు. వీఆర్వో, సర్వేయర్‌ను పంపించి రికార్డు పరంగా ఎవరి పేరుంటే వారికి అప్పగిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రొద్దుటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం సమీపంలో వున్న రామేశ్వరం హెడ్ వాటర్ వర్క్సు వద్ద పెన్నానదిలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆగని ఇసుక దందా అనే కథనం వచ్చింది. స్పందించిన రూరల్ పోలీసులు పెన్నానది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. తహసీల్దారు గంగయ్య వీటిని పరిశీలించి జరిమానా విధిస్తారని ఎస్‌ఐ రాజు తెలిపారు.

వ్యవసాయ పరపతి సంఘ అభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): లింగాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని చైర్మన్ సిద్దారెడ్డి నాగమునిరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ లింగాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. చైర్మన్‌గా నాగమునిరెడ్డితో పాటు డైరెక్టర్లుగా లక్ష్మీనారాయణమ్మ, రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగమునిరెడ్డి మాట్లాడుతూ రైతులకు సకాలంలో పంటరుణాలు అందించి, రైతుల సభ్యత్వం పెంచి సహకార రంగాన్ని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు టాయిలెట్ టూల్స్ అందజేత

కాశినాయన, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలలకు టాయిలెట్ టూల్స్ పంపిణీ చేసినట్లు ఎంఈవో నిర్మల తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని నర్సాపురం ఎమ్మార్సీ కార్యాలయానికి వచ్చిన బ్రష్‌లు, శుభ్రంచేసుకొనే మోప్‌లు, కర్రలు, లైబ్రరీ బుక్స్, 6నుండి 10తరగతి విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలు, పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు కోట్లు, గ్లౌజ్‌లు అందించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది దస్తగిరి, రామారావు పాల్గొన్నారు.

వెల్లాలలో శ్రావణ మాస ప్రత్యేక పూజలు

రాజుపాలెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ, సంజీవరాయస్వామి దేవస్థానంలో శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఊరేగింపులో గోపల్లె మహిళలు చెక్క భజనలు చేశారు. ఉదయం నుండి సంజీవరాయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఇన్‌చార్జ్ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, దుద్యాల సుబ్బిరెడ్డి, కమిటి మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



చెన్నకేశవస్వామి శ్రీదేవి భూదేవిల గ్రామోత్సవం

ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరే లక్ష్యం కావాలి

● వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల సమావేశంలో డీఎల్‌డీవో సుబ్రమణ్యం

ప్రొద్దుటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరే లక్ష్యం కావాలని డీఎల్‌డీవో సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు-వినియోగంపై వ్యాపార, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నా మనం మొద్దునిద్రలో వున్నామన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా స్టీలు ప్లేట్లు, స్టీలు గ్లాసులు వాడాలన్నారు. క్యారీ బ్యాగులుగా వాడుతున్న ప్లాస్టిక్ చాలా ప్రమాదకరమన్నారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను ప్రొద్దుటూరు పట్టణంలో ఎక్కడా వినియోగించకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సెప్టెంబరు వరకు ప్లాస్టిక్‌పై దాడులు చేస్తామన్నారు. కిరాణ షాపులు, చికెన్, మటన్ షాపులు, హోటళ్లు, పండ్ల బండ్లు, బ్రాందీ షాపులు, బార్లు, కళ్యాణ మండపాలు, కర్రీస్ పాయింట్లు, టీ హోటళ్లు, ఎక్కడ ప్లాస్టిక్ కవర్లు కనపడినా సీజ్ చేసి జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూరుబాషా, సుబ్బరాయుడు సునీత పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో ముమ్మర తనిఖీలు

ప్రొద్దుటూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. శనివారం ప్రొద్దుటూరు డివిజన్ ఏడీఏ అనిత, ఏవో వరా హరికుమార్ తమ సిబ్బందితో కలిసి ఈ తనిఖీలను చేపట్టారు. మూడు రోజుల కిందట వ్యవసాయ శాఖ జేడీఏ చంద్రానాయక్ పట్టణంలోని ఓ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించి అమ్మకాలపై విధివిధానాలను, సూచనలను జారీ చేశారు. ఈ క్రమంలో మైదుకూరు రోడ్డులోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రికార్డులను, స్టాకు వివరాలను పరిశీలించారు. కాలం చెల్లించిన వాటిని అమ్మకాలు చేయవద్దన్నారు. ప్రతి కొనుగోలుకు కచ్చితంగా రశీదులను ఇవ్వాలని సూచించారు.



స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న ఏడీఏ అనిత

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఎర్రగుంట్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కో, డిస్కంలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని టీఎన్‌వీకేఎస్ రీజనల్ కార్యదర్శి కేతు శివప్రకాష్‌రెడ్డి కోరారు. శనివారం విజయవాడ మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజును కలిసి కార్మికుల తరుపున వినతిపత్రం ఇచ్చారు. కాంట్రాక్టు కార్మికులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని, ఎంతో కాలంగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి వారి సమస్యలను పరిష్కంచాలని, ఏపీడీసీఎల్ కృష్ణపట్నంలోని ఉద్యోగులను పర్మనెంట్ చేసిన విధంగా డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే అందజేయాలన్నారు. ఈ విషయాలను సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. టీఎన్‌వీకేఎస్ సభ్యులు ఫకూర్‌బాష, ఖాజా, ప్రసాద్ పాల్గొన్నారు.

బడికి దూరమైన వారికి ఓపెన్‌స్కూల్ మంచి అవకాశం

కొండాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): బడికి దూరమైన వారికి ఓపెన్‌స్కూల్ మంచి అవకాశమని జిల్లా ఓపెన్‌స్కూల్ కో-ఆర్డినేటర్ బోడేల సాంబశివారెడ్డి తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో శనివారం ఓపెన్‌స్కూల్ పోస్టర్లను ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్‌స్కూల్ ముఖ్యంగా గ్రామీణ మహిళలు, వ్యాపారస్తులు, బడిమానేసి చదువుకు దూరమైన వారికి సువర్ణావకాశం అన్నారు. వారు నేరుగా పదవ వతరగతి, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ పొందవచ్చునన్నారు. పరీక్షల్లో పాసైన వారికి ప్రభుత్వం సర్టిఫికెట్లు మంజూరు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో రామయ్య, హెడ్మాష్టర్లు శివప్రసాద్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణుల జీవనోపాధిలో పాడి పరిశ్రమ కీలకం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల జీవనోపాధిలో పాడిపరిశ్రమ ప్రముఖ పాత్ర పోషిస్తోందని వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రవికుమార్ అన్నారు. శనివారం వెంకటేశ్వర పశువైద్య కళాశాలలో సుస్థిర గ్రామీణ జీవనోపాధిలో పాడిపరిశ్రమ ఆవశ్యకతపై అయిదు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నష్టపోయిన రైతులను పాడిపరిశ్రమ ఆదుకుంటుందని తెలిపారు. యూనివర్శిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి మాట్లాడుతూ రైతులు శిక్షణను సద్వినియోగం చేసుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక సంయుక్త సంచాలకులు డాక్టర్ శారదమ్మ, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్, కోఆర్డినేటర్ డాక్టర్ రాజాకిశోర్, పశు వైద్యులు చరిత, త్రివేణి, ప్రశాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కరెంటు చార్జీలు తగ్గించాలి

సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్

పోరుమామిళ్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): తమ ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు, కరెంటు చార్జీలు తగ్గించాలంటూ సీపీఎం మండల కార్యదర్శి భైరవప్రసాద్ అన్నారు. ఈ మేరకు శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు అదానికి ఇవ్వడం రాష్ట్ర ప్రజలకు శాపంగా మారిందన్నారు. 1998లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు విద్యుత్ సంస్కరణల పేరిట ప్రైవేటు రంగాన్ని ప్రవేశపెట్టి ప్రజలపై మోయలేని విద్యుత్ చార్జీల భారాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో గౌసియాబేగం, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన ఉండాలి

పోరుమామిళ్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన ఉండాలని ఎంఈవో కొండిశెట్టి అన్నారు. శనివారం స్థానిక ఓఎల్‌ఎఫ్ పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూలులో గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి టచ్, చెడు టచ్ మధ్య తేడా వివరించడంతో పాటు అసౌకర్య పరిస్థితుల్లో నో గో టెల్ తత్వాన్ని పాటించాల్సిన అవసరంపై ప్రదర్శన రూపంలో వివరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అమ్మాయిలకు అవగాహన కల్పించడమే ఈ యాక్ట్ ముఖ్య ఉద్దేశమన్నారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా ఇదే యాక్ట్ ప్రదర్శించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఓఎల్‌ఎఫ్ పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వే లేకుండానే ఫైనల్ లిస్టు చేశారా..?

● మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చెన్నరాయుడు

పోరుమామిళ్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): పీ-4కు సంబంధించి సర్వే చేయకుండానే ఫైనల్‌లిస్టు తయారు చేస్తారా అంటూ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నిరుపేద కుటుంబం ఉన్నతస్థాయికి ఎదగాలని కూటమి ప్రభుత్వం పీ-4 సర్వే నిర్వహించింది. కానీ రంగసముద్రం సచివాలయం-1, 2లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలలో ఎందరో నిరుపేదలు ఉన్నారని, కానీ ధనికుల పేర్లు నమోదయ్యాయని ఆ ప్రాంతప్రజలు శనివారం చెన్నరాయుడు, టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సచివాలయ సిబ్బందిని సమాచారం అడగ్గా ఇది ప్రభుత్వం నుంచి ముందుగానే వచ్చిన జాబితా అని, తాము తయారు చేయలేదన్నారు. ఇంటింటికీ వెళ్లి నిజమైన పేదలను గుర్తించి జాబితా తయారు చేయాలని, లేదంటే అధిష్ఠానం దృష్టికి, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

నిరుపయోగ గోదాము పరిశీలన



గోదామును పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణయ్య, సహకార సంఘం సీఈవో రామమోహన్

దువ్వూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కానగూడూరు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న గోదామును శనివారం ఎంపీడీవో రామకృష్ణయ్య, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో రామమోహన్ పరిశీలించారు. పంచాయతీరాజ్ ఏఈ సుబ్రమణ్యంతో కలిసి వీరు ఇక్కడకు వచ్చారు. గోదామును ఉపయోగంలోకి తెస్తే ఎలా ఉంటుందని పరిశీలన చేశారు. నిల్వ కోసం తెచ్చే సరుకులతో కూడిన వాహనాలు నిలబడే సౌకర్యం పరీక్షించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మితమైన వీటిని ఉపయోగంలోకి తేలేకపోయారని ప్రజలు విమర్శిస్తున్నారు. దాదాపు రూ.45 లక్షలతో నిర్మించి నెలల తరబడి నిరుపయోగంగా ఉంచడంపై విమర్శలు తలెత్తుతున్నాయి.

'సుపరిపాలనలో తొలి అడుగు'ను శ్రద్ధగా పూర్తి చేయాలి

జమ్మలమడుగు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త శ్రద్ధ తీసుకుని పూర్తి చేయాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జమ్మలమడుగు పర్యటనకు వస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పూర్తి చేశామని, మిగిలిన గ్రామాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి శ్రద్ధతో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి, పొన్నతోట శ్రీను, మోరగుడి రాజా, బిర్రు సంతోష్, ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నూర్‌బాషా దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం

జమ్మలమడుగు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూర్‌బాష దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని జమ్మలమడుగు నూర్‌బాష దూదేకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దూదేకుల కిరణ్ అన్నారు. శనివారం జమ్మలమడుగులోని సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు అనే విధంగా ముందుకు వెళుతున్నారని, టీడీపీతోనే దూదేకుల కులస్థులకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు దూదేకుల జమాల్, ప్రధాన కార్యదర్శి అశోక్ ఆర్యన్, దస్తగిరి, నాగరాజు, చిన్నకుళాయిస్వామి, ఇంద్రకాంత్, సుబ్బరాయుడు, చిన్నపీరయ్య పాల్గొన్నారు.

కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలి

● ఎంపీ, మాజీ ఎమ్మెల్యే హితవు

దువ్వూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ కడుపుకొట్టే, కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హితవు పలికారు. మండలంలోని ఇడమడక వద్ద పడగొట్టిన డాబాను శనివారం వారు రెండోసారి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ అధికారుల సహకారంతో డాబా నిర్వాహకుల కడుపు కొట్టారని విమర్శించారు. కేసీ, ఎండోమెంట్, నేషనల్ హైవే వారితో డాబాను పడగొట్టే ప్రయత్నం మొదట విఫలమైందని, ఎమ్మెల్యే చొరవతో డాబా పడగొట్టడం న్యాయమా అని ప్రశ్నించారు. వీరివెంట జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, జడ్పీటీసీ, మండలాధ్యక్షుడు జయచంద్రారెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గ్రంథాలయ భవనం ఏర్పాటు చేయాలి

బద్వేలుటౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గ్రంథాలయానికి సొంత భవనం మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డిలకు టీడీపీ నాయకులు శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ స్పందించిన రితేష్‌కుమార్‌రెడ్డి గోపవరం తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్‌మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్‌బాషా, బిగ్‌బాస్, బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ కార్యదర్శి సత్తార్, తదితరులు పాల్గొన్నారు.